# జోరుగా వరినాట్లు

- వికారాబాద్ జిల్లాలో వరి సాగుకే రైతుల మొగ్గు
- యాసంగిలో 72,618 ఎకరాల్లో వరి పంట వేసే అవకాశం
- గతేడాదితో పోలిస్తే ఈసారి తగ్గనున్న సాగు విస్తీర్ణం
- రైతులకు అందుబాటులో 14 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

బొంరాస్‌పేట, జనవరి 17 : జిల్లాలో యాసంగి సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆయా పంటల సాగు ఇప్పటికే తరువాత బొంరాస్‌పేట మండలంలో 12 వేల ఎకరాల్లో సాగవుతున్నది. వరి పంటకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం సులభతరం చేసింది. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఏటా వరి సాగుకు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో లఖ్నాపూర్, జుంటుపల్లి ప్రాజెక్టుల కింద కొంత మేర వరి పంటను సాగు చేస్తారు. వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతుండడంతో మహిళా కూలీలకు చేతినిండా పని దొరుకుతున్నది. ఎకరా పొలంలో నాటు వేసేందుకు రూ.5 వేల వరకు కూలీ తీసుకుంటున్నారు. మహిళా కూలీలతో పాటు ట్రాక్టర్ల యజమానులకు కూడా కరిగెట పనులు దొరుకుతున్నాయి.



బొంరాస్‌పేటలో వరినాట్లు వేస్తున్న మహిళలు

పూర్తికాగా ప్రస్తుతం వరినాట్లు జోరందుకున్నాయి. వికారాబాద్ జిల్లాలో గత యాసంగిలో 90,495 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేయగా, ఈసారి 72,618 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో సాగునీటి కొరత ఏర్పడింది. దీంతో రైతులు గతసారి కంటే కొంత విస్తీర్ణాన్ని తగ్గించుకొని వరిసాగు చేస్తున్నారు. దోమ మండలంలో అత్యధికంగా 12,780 ఎకరాల్లో వరిసాగయ్యే అవకాశం ఉండగా.. ఆ

**14 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు..**

యాసంగి వ్యవసాయ పనులకు అవసరమయ్యే ఎరువులు జిల్లాలో సమృద్ధిగా ఉన్నాయి. యాసంగి సీజన్‌లో జిల్లాకు 30 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ప్రస్తుతం 14 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారులు తెలిపారు. మిగతా ఎరువులు ఎప్పటికప్పుడూ వస్తూనే ఉంటాయని, ఎరువులకు ఎలాంటి కొరత లేదని తెలిపారు.


నమస్తే తెలంగాణ

రంగారెడ్డి

13 | హైదరాబాద్, గురువారం 18 జనవరి 2024 | RANGAREDDY




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, చిత్రంలో నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు

- కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం

# భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే

రంగారెడ్డి, జనవరి 17(నమస్తే తెలంగాణ) : భవిష్యత్ అంతా బీఆర్‌ఎస్‌దేనని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సన్నాహక సమావేశం జరిగింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తోపాటు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు సన్నాహక సమావేశానికి తరలివెళ్లారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటును మరోసారి గెలుచుకునేలా నేతలకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సమావేశంలో దిశా నిర్దేశం చేశారు.

**రెట్టించిన ఉత్సాహంతో పనిచేద్దాం..**

అసెంబ్లీ ఎన్నికల ఓటమితో ఎవరూ అధైర్యపడొద్దని, పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేద్దామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, హామీలను అమలు చేయలేక కాంగ్రెస్ నేతలు కాకమ్మ కథలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్లలోపే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశంలో కోకొల్లలని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిందని, అయితే ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రం ఇప్పటికే చేతులెత్తేసిందన్నారు. తెలంగాణలోనూ గ్యారంటీల చావు వార్తను కాంగ్రెస్ నేతలు చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేశారని, ఇది ఎవరూ కాదనలేని సత్యమని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుస్తేనే తెలంగాణ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, కీలక సమయంలో బీఆర్‌ఎస్ ఎంపీలు ఢిల్లీలో లేకపోతే తెలంగాణకు నష్టమన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గుణపాఠంగా నేర్చుకుని ముందుకు సాగుదామని, పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపునిచ్చారు.



హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

**గెలుపుపై దిశానిర్దేశం..**

నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం 1967లో ఏర్పాటు కాగా దీని పరిధిలో వనపర్తి, గద్వాల్, ఆలంపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ లోక్‌సభ స్థానానికి ఇప్పటివరకు 14 సార్లు ఎన్నికలు జరిగాయి. 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపొందగా ఎంపీగా రాములు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సన్నాహక సమావేశానికి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. మరోసారి గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ నేతల నుంచి అభిప్రాయాలను సేకరించారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సన్నాహక సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, తలకొండపల్లి, కడ్తాల్ జడ్పీటీసీలు ఉప్పల వెంకటేశ్, దశరథ్ నాయక్‌లు, వైఎస్ ఎంపీపీలు జక్కు అనంత రెడ్డి, ఆనంద్‌లు, సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహా రెడ్డి, మండల అధ్యక్షులు అర్జున్ రావు, జైపాల్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మైనార్టీ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

వికారాబాద్, జనవరి 17 : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరానికి వివిధ తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి డి.సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 6 గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఆన్‌లైన్‌లో www. tmreistelangana.cgg.gov. in ద్వారా, టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇతర వివరాలకు 9959746436 కు ఫోన్ చేయాలన్నారు. లేదా వికారాబాద్ బాలుర 1 పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పకీరా రాత్లావత్‌ను సంప్రదించాలని సూచించారు. 5వ తరగతిలో ముందు వచ్చిన మైనార్టీలకు సీట్లు ఇస్తామన్నారు. ఇతరులకు లక్కీ డ్రా ద్వారా సీట్లు కేటాయిస్తామని వివరించారు. 6,7,8 తరగతులకు ఖాళీలు ఉన్నాయన్నారు.

# బుక్ కీపర్ చేతివాటం

- మహిళా సంఘానికి రూ.2.50 లక్షల కుచ్చుటోపి
- సంఘం డబ్బులను తన భార్య బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసిన బుక్ కీపర్ మల్లేశం
- సంఘం ఖాతాలోనే ఉన్నాయంటూ కాలయాపన చేస్తున్న వైనం
- ఆలస్యంగా అసలు విషయం బయటకు..
- లోన్ల మంజూరు విషయంలోనూ అడ్డగోలుగా కమీషన్లు వసూలు చేస్తున్న బుక్ కీపర్లు

దోమ, జనవరి 17 : మహిళా సాధికారత కోసం ఏర్పాటు చేసిన ఇందిరా క్రాంతి పథకం(ఐకేపీ)లో అవకతవకలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. దోమ మండలంలోని మోత్కూరు గ్రామంలో ఓ బుక్ కీపర్ చేతివాటం ఆలస్యంగా వెలుగుచూసింది. మహిళా సంఘానికి చెందిన డబ్బులు గుట్టుచప్పుడు కాకుండా కాజేశాడు. వివరాల్లోకి వెళితే మోత్కూర్‌లో మహిళా సంఘాల నిర్వహణ నిమిత్తం గ్రామానికి చెందిన కటికె మల్లేశం అనే వ్యక్తి బుక్ కీపర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో 2022 సవంత్సరం ఆగస్టు 30 వ తేదీన గ్రామానికి చెందిన శివశ్రీ మహిళా సంఘానికి దోమ ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ.7.50 లక్షలు మంజూరు చేయించిన అతడు చేతివాటం ప్రదర్శించాడు. బ్యాంకు ఉద్యోగులతో కుమ్మక్కైన మల్లేశం సదరు సంఘం ఖాతాలోకి కేవలం రూ.5 లక్షలు బదిలీ చేయించి.. మిగతా రూ.2.50 లక్షలు ఖాతాలోనే ఉంటాయంటూ సంఘం సభ్యులను నమ్మించి గుట్టు చప్పుడు కాకుండా తన భార్య ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. ఈ రుణం తిరిగి బ్యాంకుకు చెల్లించడానికి ఉపయోగపడే రిజిస్టర్‌ను సంఘానికి ఇవ్వకుండా బ్యాంకు మేనేజర్‌ను మేనేజ్ చేస్తూ కాలయాపన చేశాడు. నెలలకొద్ది బ్యాంకు చుట్టూ తిరిగినా సిబ్బంది ఏదో ఒక సాకు చెప్పి రిజిస్టర్ ఇవ్వకుండా నిరాకరించడంతో అనుమానం వచ్చిన సంఘం సభ్యులు ఐకేపీ కార్యాలయం నుంచి గ్రామానికి బాధ్యత వహిస్తున్న సీసీని సంప్రదించారు. సీసీ జోక్యంతో బ్యాంకు సిబ్బంది రిజిస్టర్ ఇవ్వడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై మల్లేశంను నిలదీయగా.. ఈరోజు, రేపు ఇస్తానంటూ కాలయాపన చేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన సంఘం సభ్యులు బుధవారం ఐకేపీ కార్యాలయ ఏపీఎం సురేశ్‌ను కలిసి బాధ్యుడైన బుక్ కీపర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా బుక్ కీపర్లు మహిళా సంఘాలకు లోన్లు ఇప్పించే క్రమంలో లక్ష లోనుకు గాను రూ.1000 చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఏపీఎం సురేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

**రికవరీ చేయిస్తాం...**

మోత్కూర్ గ్రామ మహిళా సంఘానికి మంజూరైన లోన్‌లో జరిగిన అవకతవకలపై దోమ ఏపీఎం సురేశ్‌ను వివరణ కోరగా అవకతవకలకు పాల్పడ్డ బుక్ కీపర్ మల్లేశం నుంచి అట్టి డబ్బులను రికవరీ చేయించి సంఘం సభ్యులకు న్యాయం చేస్తామన్నారు. అంతేకాకుండా డబ్బులు కాజేసేందుకు సహకరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# రోజూ 2 గంటలు కరెంటు కోతలు


## మరమ్మతుల పేరిట విద్యుత్ నిలుపుదల

## జనవరి 17 నుంచి ఫిబ్రవరి 10 వరకు షెడ్యూలు విడుదల

### శీతాకాలం కోతలపై సోషల్ మీడియాలో ఫిర్యాదుల వెల్లువ

### గందరగోళంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : శీతాకాలంలోనే విద్యుత్ మరమ్మతుల పేరిట అధికారికంగా రోజూ 2 గంటలు విధిస్తున్న కరెంటు కోతలపై నగర వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో నిరంతరం నాణ్యమైన కరెంటు సరఫరా కోసం అంటూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ విడుదల చేసిన మరమ్మతుల ప్రణాళికపై మండిపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యుత్ మరమ్మతులు చేపట్టినా ఇలాంటి పరిస్థితి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంటు కోతలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం జనవరి 17నుంచి ఫిబ్రవరి 10 వరకు గ్రేటర్‌లోని 9 సర్కిళ్ల పరిధిలో 2 గంటలు కరెంటు కోతలు ఉంటాయనడంతో సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం అయింది. బుధవారం కరెంటు కోతలపై సోషల్ మీడియాలో పలువురు వినియోగదారులు పోస్టు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీకి ట్యాగ్ చేస్తూ పోస్టులు చేస్తూనే ఉన్నారు. మరమ్మతుల షెడ్యూలు ప్రకటించిన ప్రాంతాలే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా అంతరాయం ఉన్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు.





**నేడు 125 ఫీడర్స్ పరిధిలో..**

గురువారం మొత్తం 125 ఫీడర్ల పరిధిలో మరమ్మతులు ఉంటాయని అధికారులు తెలిపారు. ఇందులో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్, మేడ్చల్, హబ్సీగూడ, సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలో 11 కేవీ ఫీడర్లు మొత్తం 2352 ఉన్నాయి. అందులో 125 ఫీడర్ల పరిధిలోనే విద్యుత్ లైన్ల మరమ్మతుల వల్ల కనిష్ఠంగా 30 నిమిషాల నుంచి గరిష్ఠంగా 2 గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తామని అధికారులు తెలిపారు.

**ట్వీట్‌లలో మచ్చుకు కొన్ని..**

- శంకర్‌మఠ్ పవర్ స్టేషన్ పరిధిలో 2గంటల కంటే ఎక్కువ సమయం విద్యుత్ కోత ఏర్పడింది. ప్రతి 30 నిమిషాల తర్వాత పవర్ కట్ సమస్య ఉంది. ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ (9490619768)కు ఫోన్ చేస్తే ఎటువంటి ప్రతిస్పందన లేదు. దయచేసి త్వరగా పునరుద్ధరించండి.' అంటూ జీషాన్ అహ్మద్ ట్వీట్ చేశారు.
- 3గంటలకు పైగా కరెంటు కోత ఉంది. ఏం జరుగుతోంది? కరెంటు కోతలు ఎందుకు వస్తున్నాయి? అంటూ సయ్యద్ సలార్ ట్వీట్ చేశారు.
- భారతి నిలయం వద్ద 2 గంటలకు పైగా కరెంటు లేదు. ఏదైనా సమస్య ఉందా? 1-9-202/ఇ/1/డి/1 రాంనగర్, పార్సిగుట్టలో ఉంటాను. దయచేసి అప్‌డేట్ చేయండి' అంటూ మాచర్ల శివానీ ట్వీట్ చేశారు.
- మా ఏరియాలో కరెంటు కోత పెట్టి 2.5 గంటలైంది. మెయింటెనెన్స్ కారణంగా పవర్ కట్ అవుతుందని నాకు తెలుసు, కానీ అధికారులు రోజు మొత్తం మెయింటెనెన్స్ చేయాలనుకోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది? అని సతీశ్ కుమార్ ట్వీట్ చేశారు.

## ఫోన్ పోయిందా.. దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్, జనవరి 17 : చోరీకి గురైన, పోయిన సెల్‌ఫోన్లను కనుగొనేందుకు సీఈఐఆర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు, రిసెప్షనిస్టులు, ఎస్సైలకు CEIR (CENTRAL EQUIPMENT IDENTITY REGISTER ) అనే కొత్త అప్లికేషన్‌పై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ మీటింగ్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఫోన్లు పోయిన వెంటనే తమ పరిధిలోని పోలీసులకు సమాచారం అందించి తిరిగే పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనే ముందు ఈ అప్లికేషన్‌లో ఆ ఫోన్ వివరాలను (ఐ.ఎం.ఈ.ఐ) నంబర్లు నమోదు చేసి చెక్ చేసుకుంటు సదరు ఫోన్ స్టేటస్ తెలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 1687 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ ద్వారా బ్లాక్ చేయడంతోపాటు 979 సెల్‌ఫోన్లను గుర్తించగా.. 249 సెల్‌ఫోన్లను తిరిగి ఫిర్యాదుదారులకు అందించినట్లు పేర్కొన్నారు.

## 20 వరకు గడువు పొడిగింపు

వ్యవసాయ యూనివర్సిటీ , జనవరి17 : గిరిజన సంక్షేమ గురుకులాల్లో నిర్వహించే 5వ తరగతి ప్రవేశ పరీక్షకు ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సమన్వయకర్త పి.ఎస్ కల్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల విద్యార్థులు సకాలంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం, బోనఫైడ్ సర్టిఫికెట్ విధిగా ఆన్‌లైన్‌లో జమ చేయాలని కోరారు.

## దరఖాస్తులకు నేటితో ఆఖరు..

శేరిలింగంపల్లి, జనవరి 17: గూగుల్ సహకారంతో కొనసాగుతున్న టాలెంట్ స్ప్రింట్ ఫర్ ఉమెన్ ఇంజినీర్స్ 6వ ఎడిషన్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈవో ఎండీ శాంతను పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరి ఉజ్వలమైన, మెరుగైన భవిష్యత్తు కోసం సాంకేతిక సామర్థ్యాన్ని వెలికితీయడం కోసం ఈ ప్రోగ్రాం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహిళా ఇంజినీర్స్ ప్రోగ్రాం విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తున్నామని, గచ్చిబౌలిలోని టాలెంట్ స్ప్రింట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రాం దరఖాస్తులకు ఈ నెల 18వ తేదీ చివరని పేర్కొన్నారు. అర్హులైన మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# నేటి నుంచి జేపీ దర్గా ఉర్సు

- మూడు రోజులు కొనసాగనున్న ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి



జేపీ దర్గా లోపలికి వెళ్లే ప్రధాన ద్వారం

కొత్తూరు, జనవరి 17: రాష్ట్రంలోనే అత్యంత ప్రఖ్యాతి గాంచిన జేపీ దర్గా ఉర్సు గురువారం నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్ మహానగరానికి కేవలం 45 కి.మీ. దూరంలో ఉన్న జహంగీర్ పీర్ దర్గాకు కేవలం తెలంగాణ నుంచే కాకుండా దేశంలోని చాలా ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. దర్గా అంటేనే ముస్లింలకు సంబంధించి అనుకుంటారు. కానీ జేపీ దర్గాకు ముస్లింకంటే హిందువులే ఎక్కువగా రావడం గమనార్హం. ఉర్సు సమయంలోనే కాకుండా మామూలు రోజుల్లో కూడా దర్గాను దర్శించుకోవడానికి హిందువులు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఎన్నో ఏండ్లుగా జేపీ దర్గా ఉర్సు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నది. గురువారం గంధోత్సవం, శుక్రవారం దీపారాధన, శనివారం ఖత్మే ఖురాన్‌తో ఉర్సు ఉత్సవాలు ముగియనున్నాయి.

**వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు**

మూడు రోజుల పాటు జరిగే ఉర్సు కోసం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. అంతే కాకుండా ప్రత్యేక రంగులతో దర్గాను అలంకరించారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు భక్తుల కోసం మరుగుదొడ్లు, స్నానాలు చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ లైట్ల కాంతులతో దర్గా దేదీప్యమానంగా వెలుగుతుంది. 17 ఎకరాల్లో వాహనాల కోసం పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు.

**పటిష్ట బందోబస్తు**

వీవీఐపీలు దర్గాకు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు. శంషాబాద్ ఏసీపీ రామచందర్ రావు ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు అధికారులకు తగు సూచనలు చేశారు. ఏసీపీతో సహీ ఏడుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 88 మంది కానిస్టేబుళ్లు, 20 మంది స్పెషల్ పార్టీ పోలీసులతో భద్రత చేపట్టనున్నారు. వీరితో పాటు ప్రత్యేక క్రైం టీంకూడా రంగంలోకి దిగనుంది. సీఐ నరసింహారావు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని వివరించారు.

**హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు**

దర్గా ఉర్సు కోసం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనుంది. గురు, శుక్ర, శనివారాలు ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. అఫ్జల్ గంజ్‌తో పాటు చార్మినార్ నుంచి ప్రతి అరగంటకు ఒక బస్సు జేపీ దర్గాకు చేరుకుంటుందని టీఎస్ ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## మైనర్ ర్యాష్ డ్రైవింగ్ తండ్రిపై కూడా కేసు

బంజారాహిల్స్, జనవరి 17 : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కారు నడిపిస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేసిన మైనర్‌తో పాటు అతడికి కారు ఇచ్చిన తండ్రిపై కూడా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎర్రగడ్డకు చెందిన బంజరంగ్ అగర్వాల్ కొడుకు (17) మూడురోజుల క్రితం మెహదీపట్నం నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నం 51వైపునకు కారులో అతివేగంగా వెళ్తూ జీహెచ్ఎంసీ డంప్ యార్డ్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టగా కారు నడిపిన అబ్బాయికి లైసెన్స్ లేదని తేలింది. కారు అతడి తండ్రి భజరంగ్ అగర్వాల్ పేరుతో ఉంది. దీంతో ర్యాష్ డ్రైవింగ్ చేసిన కొడుకుతో పాటు తండ్రిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

## 30 వరకు జంతు సంరక్షణ పక్షోత్సవాలు

వికారాబాద్, జనవరి 17 : ఈ నెల 14 ప్రారంభమైన జంతు సంరక్షణ పక్షోత్సవాలు 30వ తేదీ వరకు కొనసాగుతాయని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి. అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతు హింసకు పాల్పడకుండా, జంతువులపై కరుణతో ఉంటూ వాటిని సంరక్షించవలసిన అవసరం ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. జంతు సంరక్షణ కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలకు సహకరించాలని తెలిపారు. వన్య ప్రాణులు కనిపించినట్లయితే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వాటిని సురక్షిత అటవీ ప్రాంతానికి తరలించేవీలు కల్పించాలని పేర్కొన్నారు. పక్షులు నివసించే వృక్షాలను నరకరాదని అదేవిధంగా పశువులను , జంతువులను రవాణా చేసే క్రమంలో తప్పనిసరిగా జంతు రవాణా నిబంధనలను పాటించాలని తెలిపారు. వీధి కుక్కలు, పిల్లులకు ఆహారం, నీరు అందించాలని పేర్కొన్నారు. పెంపుడు జంతువులకు రోగ నిరోధక టీకాలు వేయించాలని పేర్కొన్నారు. పెంపుడు జంతువులను అమ్ముట, కొనుట వాటి సంతాన అభివృద్ధి (బ్రీడింగ్ )చేయడం ద్వారా వ్యాపారం చేయువారు తప్పనిసరిగా జంతు సంరక్షణ బోర్డు నుంచి రిజిస్ట్రేషన్ పొందాలని పేర్కొన్నారు. ప్రజలు తినుబండారాలు కలిగిన ప్లాస్టిక్ కవర్లను రోడ్డు పక్కన, ఆరు బయట పడేయరాదని, జంతువులు ఆ ప్లాస్టిక్ కవర్లు, సంచులు తినడం వలన చనిపోయే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ, వికారాబాద్ జిల్లా తరపున స్కూల్ పిల్లలకి జంతు సంరక్షణపై, ప్రజలకు పక్షుల కోసం జామూన్, వేప, రావి ఇతర మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీన పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని పేర్కొన్నారు.